సాక్షి
ఒడిశా

శనివారం । 31 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,07,055లు, బంగారం 1 గ్రాముల 90 మిల్లీ గ్రాములు, వెండి 30 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



బడ్జెట్ రూ. 413 కోట్లు

పూరీ జగన్నాథ ఆలయం వార్షిక బడ్జెట్ పాలక మండలి ఆమోదం పొందింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 413 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

- 8లో



వేడుకలకు వేళాయె..!

పర్లాకిమిడిలో స్థానిక సంస్థల స్వపరిపాలన దినోత్సవం శనివారం జరగనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

నేడు నవీన్ చెంతకు పోలవరం నివేదిక



పోలవరం ప్రాజెక్టు

భువనేశ్వర్ : రాష్ట్రం సరిహద్దు ప్రాంతాల అనుసంధానంతో కొనసాగుతున్న పోలవరం నీటి పారుదల ప్రాజెక్టుతో మల్కన్‌గిరి జిల్లా మోటు ప్రాంతం నీటమునుగుతుందని దీర్ఘకాలంగా వివాదం కొనసాగుతోంది. మరోవైపు కేంద్రంలో బీజేపీ సర్కారు ఈ ప్రాజెక్టు పూర్తికి అండగా నిలుస్తానని తాజాగా అభయం ఇచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అధికార బీజేపీ చొరవ తీసుకోకపోవడంతో విపక్ష బిజూ జనతా దళ్ రంగంలోకి దిగింది. క్షేత్ర స్థాయిలో సమీక్షించేందుకు బీజేడీ ప్రత్యేక నిజ నిర్ధారణ బృందాన్ని నియమించింది. దేవీ ప్రసన్న మిశ్రా ఆధ్వర్యంలో ఈ కమిటీ పోలవరం నీటి పారుదల ప్రాజెక్టు కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా ప్రాంతాన్ని సందర్శించింది. మున్నా ఖాన్, అతున్ సబ్యసాచి నాయక్, ప్రదీప్ మాఝీ తూర్పు గోదావరి జిల్లాలో పోలవం నీటి పారుదల ప్రాజెక్టు ప్రభావాన్ని సమీక్షించారు. ఈ వివరాలతో సమగ్ర నివేదికను బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌కు శనివారం సమర్పించనున్నట్లు దేవి ప్రసన్న మిశ్రా తెలిపారు.

బైపాస్ రోడ్డు పనులు చేపట్టాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: పర్లాకిమిడి బైపాస్ రోడ్డుకు రూ.40 కోట్లు మంజూరైనా ఇంతవరకూ రోడ్లు-భవనాల శాఖ పనులు ప్రారంభించలేదని, పట్టణంలో ఎక్కడికక్కడ గోతులు ఏర్పడటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక శాసనసభ్యులు రూపేష్ పాణిగ్రాహి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం అసెంబ్లీ లంచ్ మోషన్‌లో రాష్ట్ర అబ్కారీ, న్యాయసలహా మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్‌ను కలిసి పర్లాకిమిడిలో రోడ్ల మరమ్మతులు, బైపాస్ రోడ్డు నిర్మాణంపై వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పాత్రికేయులకు తీపికబురు

భువనేశ్వర్: పాత్రికేయులకు సంబంధించి గోపబంధు ఆరోగ్య బీమా పథకం మరో ఏడాది వరకు పాటు నిరవధికంగా కొనసాగుతుందని శాసన సభలో శుక్రవారం ప్రకటించారు. గతంలో జారీ చేసిన జాబితా ప్రకారమే లబ్ధిదారులను పరిగణనలోకి తీసుకుంటారు. ఇటీవల పాత్రికేయ వృత్తి నుంచి వైదొలగిన, సంస్థ మారిన లేదా మృతి చెందిన వారి వివరాలు తక్షణమే ప్రభుత్వానికి అందజేయాలని సమాచార, ప్రజా సంబంధాల శాఖను ఆదేశించారు. విపక్ష బిజూ జనతా దళ్ సభ్యుడు గౌతమ్ బుద్ధదాస్ పాత్రికేయుల ఆరోగ్య బీమా పథకం కొనసాగింపు విషయమై సభలో ప్రస్తావించడంతో ప్రభుత్వం ఈ మేరకు స్పష్టతనిచ్చింది. ఏటా జూన్, జూలైలో జరగాల్సిన పథకం రెన్యువల్‌లో జాప్యం పట్ల ఆయన సభలో నిలదీశారు.

నిద్ర'మత్తు'లో ఉపాధ్యాయుడు



తాగి వచ్చి దుప్పటి కప్పుకుని నిద్రపోతున్న ఉపాధ్యాయుడు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి కుందయి పంచాయతీ బర్కుహలి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు పూటుగా మద్యం తాగి శుక్రవారం విధులకు హాజరయ్యాడు. సుమారు 60 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాల గదిలోనే దుప్పటి తెచ్చుకుని నిద్రపోయాడు. వెంటనే చిన్నారులకు తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారంతా వచ్చి నిద్రలేపారు. అనంతరం పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఇటువంటి ఉపాధ్యాయులను గిరిజన ప్రాంతాలకు పంపి పిల్లల భవిష్యత్‌తో ఆడుకోవద్దని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు గ్రామానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు.

పసిబిడ్డలకు తప్పిన.. ప్రాణగండం!

అప్పుడే పుట్టిన పసిబిడ్డలు నవజాత శిశువుల వార్డులో హాయిగా నిద్రపోతూ చికిత్స పొందుతున్నారు. తల్లులంతా పక్క వార్డులో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇంతలో చిన్నారులు ఉంటున్న గదిలో ఒక్కసారిగా పొగలు కమ్ముకున్నాయి. ఏం జరిగిందో తెలియక అక్కడున్న వారంతా పరుగులు తీస్తున్నారు. విషయం తెలుసుకున్న బాలింతలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తమ పిల్లలను రక్షించుకునేందుకు పురిటినొప్పులతోనే పరుగులు తీశారు. సిబ్బంది సాయంతో సురక్షితంగా బయటపడ్డారు. ఎవరికీ ప్రాణహాని జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



షార్ట్ సర్క్యూట్ జరిగిన ప్రాంతం

- కొరాపుట్‌లోని ఎస్‌ఎల్ఎన్ వైద్య కళాశాలలో అగ్ని ప్రమాదం
- నవజాత శిశువుల విభాగంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్
- పొగలు వ్యాపించడంతో భయాందోళనకు గురైన బాలింతలు
- శిశువులతో కలిసి ఆస్పత్రి బయటకు పరుగులు
- చిన్నారులకు ప్రాణహాని తప్పడంతో ఊపిరి పీల్చుకున్న జనం



నవజాత శిశువును బయటకు తీసుకొస్తూ..



ప్రమాదం జరిగిన ఎస్‌ఎల్ఎన్ ఎస్ఎన్‌సీయూ భవనం ఇదే

కొరాపుట్: జిల్లా కేంద్రం కొరాపుట్‌లోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించింది. నవజాత శిశువులు చికిత్స పొందే ఎస్ఎన్‌సీయూ విభాగంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా విపరీతమైన పొగలు అలుముకోవడంతో సిబ్బంది, తల్లులు భయంతో కేకలు వేశారు. వైద్యులు, ఇతర సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. వైద్యుల పరివేక్షణలో ఉన్న సుమారు 20 మంది నవజాత శిశువులను యుద్ధ ప్రాతిపదికన బయటకు తరలించారు. పక్కనే ఉన్న గదిలో ఉన్న బాలింతలు అవస్థలు పడుతూ బయటకు పరుగులు తీశారు. సిజేరియన్లు జరిగిన బాలింతలను స్ట్రెచ్చర్లు, వీల్‌చైర్లపైనే బయటకు తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఆస్పత్రికి చేరుకుని పొగలను అదుపు చేశారు.



ఆస్పత్రి వద్ద అగ్నిమాపక వాహనం

క్షణక్షణం భయంభయం..

ఆస్పత్రిలో ప్రమాదం సంభవించిందన్న వార్త దావానంలా వ్యాపించడంతో వైద్య కళాశాలలో ఉన్న రోగులు, సమీప ప్రాంత ప్రజలు వందలాదిగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. తమ వారికి ఏం ప్రమాదం జరిగిందోనని రోగుల బంధువులు సైతం పెద్ద ఎత్తున తరలిరావడంతో వారిని అదుపు చేయడానికి భారీగా పోలీసులు మోహరించారు. ముఖ్యంగా సిజేరియన్ జరిగిన మహిళలు తీవ్రమైన నొప్పులు భరిస్తూనే బయటకు రావడం అక్కడి వారిని కలిచివేసింది.



చిన్నారిని బయటకు తీసుకొస్తూ..

పరిస్థితిని సమీక్షించిన సబ్ కలెక్టర్..

కొరాపుట్ సబ్ కలెక్టర్ వేణుధర్ సబరో ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితి సమీక్షించారు. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ నాయకుడు రూపక్ తురుఖ్ ఆసుపత్రిని సందర్శించారు. ఘటనపై అనుమానాలు వ్యక్తం చేశారు.



శిశువును రక్షిస్తున్న ఆస్పత్రి వైద్య సిబ్బంది



ఆస్పత్రి బయట బాధితులు



బాలింతని తరలిస్తున్న దృశ్యం



బాలింతను వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న సిబ్బంది

జెడ్పీ సభ్యురాలు సుస్మితా మాఝి అరెస్ట్



సుస్మితా మాఝి

మల్కన్‌గిరి: మత్తిలి సమితి జిల్లా పరిషత్ సభ్యురాలు సుస్మితా మాఝిని శుక్రవారం మత్తిలి పోలీసులు అరెస్టు చేశారు. పాండ్యన్ పేరిట డబ్బులు వసూలుకు పాల్పడిన రమేష్ రౌత్‌ను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేయగా.. ఇదే కేసులో ముఖ్య నిందితురాలిగా ఉన్న సుస్మితా పరారీలో ఉన్నారు. ఆమెకు డబ్బులు ఇచ్చిన వ్యక్తులు పదేపదే ఫోన్ చేయడంతో పోలీసులు లొకేషన్ ట్రేస్ చేసి జగత్‌సింగ్‌పూర్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే మత్తిలి నుంచి పోలీసు బృందం వెళ్లిని ఆమెను అరెస్టు చేశారు. కేసులో సంబంధం ఉన్న ప్రతిఒక్కరినీ అరెస్టు చేస్తామని ఎస్పీ నితీష్ వాద్వానీ తెలిపారు. కాగా, సుస్మితాను బీజేడీ నుంచి రెండు రోజుల కిందటే బహిష్కరించారు.

డయేరియాతో మహిళ మృతి



మృతి చెందిన సీమా ననాక

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి జగదల్‌పూర్ పంచాయతీ గొతిగుడ గ్రామంలో డయేరియా(అతిసార)తో బాధపడుతూ సీమా ననాక (47) అనే మహిళ మృతి చెందింది. రెండు రోజులుగా వాంతులు, విరేచనాలు ఎక్కువకావడంతో పరిస్థితి విషమించి గురువారం సాయంత్రం మృతి చెందింది. గ్రామానికి చెందిన నీలావతి, రాధ, కవిత, దయా, మాలంతి కెరుగుడ, రజేష్, పూల, సునారి, చంద్రావతిలు కూడా డయేరియాతో బాధపడుతున్నారు. అధికారులకు విషయం తెలియజేసినా ఇంతవరకు వైద్య బృందం పర్యటించలేదని జగదల్‌పూర్ పంచాయతీ సర్పంచ్ రామేశ్వర్ బరియాక తెలిపారు. జగదల్‌పూర్ పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ ఆశీష్ పండ దృష్టికి సమస్య తీసుకువెళ్లగా వైద్య బృందాన్నిపంపించి పరిస్థితిని సమీక్షిస్తామని చెప్పారు.

నువా-ఓ.. నిధులకు నో

- స్కాలర్‌షిప్‌ను రద్దు చేసిన కొత్త సర్కారు
- త్వరలో కొత్త పథకం అమలు చేస్తామని ప్రకటన



నువా - ఓ స్కాలర్‌షిప్ లోగో

భువనేశ్వర్: గత బిజూ జనతా దళ్ హయాంలో ప్రవేశపెట్టిన 'నూతన ఉన్నత అభిలాష-ఒడిశా(నువా-ఓ) స్కాలర్‌షిప్ పథకాన్ని మోహన్‌చరణ్ మాఝీ ప్రభుత్వం రద్దు చేసింది. నువా-ఓ పథకం కింద అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఆర్థిక సహాయం లభించేది. ఈ సంవత్సరం నుంచి ఈ పథకం నిలిపివేసినట్లు ఉన్నత విద్యా శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ శుక్రవారం ప్రకటించారు. రాష్ట్ర శాసనసభలో ఎమ్మెల్యే చక్రమణి కన్హర్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, ఈ సంవత్సరం నుంచి 'నువా-ఓ' పథకానికి బడ్జెట్ కేటాయింపులు లేవని స్పష్టం చేశారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఆర్థిక సహాయం, ఉన్నత చదువులకు దూరంగా ఉన్న విద్యార్థులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం నుంచి కొత్త పథకాన్ని సిద్ధం చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి మేధావి ఛత్ర (విద్యార్థి) ప్రోత్సాహకం పథకం అమలవుతోందని, దీని కింద ఈ-మేధా భృతి, వ్యాసకవి ఫకీర్ మోహన్ భాషా భృతి స్కాలర్‌షిప్, గోపబంధు శిక్ష్యా సహాయ పథకంతో సహా వివిధ స్కాలర్‌షిప్‌లు ఉన్నాయని వివరించారు. పోస్టు గ్రాడ్యుయేటు మెరిట్, సాంకేతిక, వృత్తిపరమైన మెరిట్ సాధించిన ఆర్థిక బలహీన పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు సహాయం చేయడానికి కొత్త పథకంలో అవకాశాలు కల్పించనట్లు మంత్రి పేర్కొన్నారు.

– ఈ ఏడాది ఫిబ్రవరిలో మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఉన్నత విద్యా శాఖ పాలనా సంస్కరణలో భాగంగా రాష్ట్రంలోని ఉన్నత విద్యా సంస్థలలో విద్యార్థుల కోసం నువా - ఓ స్కాలర్‌షిప్‌ను ప్రారంభించారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు రూ. 9,000 (బాలురు), రూ.10,000 (బాలికలు) చొప్పున వార్షిక స్కాలర్‌షిప్ ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు ఏడాదికి రూ.10,000 (బాలురు), రూ. 11,000 (బాలికలు) చొప్పున స్కాలర్‌షిప్ మంజూరు చేశారు. 2023-24 నుంచి 2027-28 వరకు ఐదేళ్ల కాలంలో రూ. 3,701.08 కోట్ల వ్యయ ప్రణాళికతో ఈ పథకాన్ని గత ప్రభుత్వం ప్రకటించింది.



ప్రలంబాసుర వధ

పవిత్ర భాద్రపద కృష్ణ పక్ష ద్వాదశి తిథి సందర్భంగా శుక్రవారం పూరీ శ్రీ మందిరంలో ప్రలంబాసుర వధ అలంకరణ నిర్వహించారు. మధ్యాహ్న ధూపదీపాదుల అనంతరం బలరాముడు.. ప్రలంబ అనే అసురుని సంహరించినందుకు గుర్తుగా రత్న వేదికపై బలభద్ర స్వామి ఈ రూపాన్ని ధరిస్తాడు.

- భువనేశ్వర్

విజిలెన్స్ వలలో జూనియర్ క్లర్క్



ప్రదీప్ దాస్

భువనేశ్వర్: బాలేశ్వర్ డీఈఓ జూనియర్ క్లర్క్ ప్రదీప్ దాస్ శుక్రవారం విజిలెన్స్ వలకు చిక్కారు. శుక్రవారం షెరొగాడా కూడలి ప్రాంతంలోని మార్కెట్ కాంప్లెక్స్‌పై విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. బాలాసోర్‌లో 3 అంతస్తుల భవనం, 4 వేల చదరపు అడుగుల విస్తీర్ణపు మార్కెట్ కాంప్లెక్స్, కోటి రూపాయల విలువైన 20 దుకాణాలు, బాలాసోర్ నగరం పరిసరాల్లో 6 ఇళ్ల స్థలాలు ఉన్నట్లు సమాచారం. ఈ దాడిలో ఇద్దరు అదనపు ఎస్పీలు, నలుగురు డీఎస్పీలు, ఏడుగురు ఇన్‌స్పెక్టర్లు, ఐదుగురు ఏఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఆత్మీయ ఆలింగనం



రాష్ట్రంలో తొలిసారిగా బోండా గిరిజన తెగలో మెడిసిన్ సీటు సాధించిన మల్కన్‌గిరి జిల్లా ఖైరపుట్ మండలం బొడొబెలో గ్రామానికి చెందిన మంగళ ముదులిని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ శుక్రవారం ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. భువనేశ్వర్‌లోని లోక్ సేవాభవన్‌లో తన చాంబర్‌లో ల్యాప్‌టాప్ బహుమతిగా ఇచ్చి శాలువా కప్పి హత్తుకున్నారు. వైద్య విద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గొండో, ఎమ్మెల్యేలు గౌరీ శంకర్ మఝి(నబరంగ్‌పూర్), నరసింగ మడ్కామి (మల్కన్‌గిరి), లారిషిస్ ఆచార్య (బట్లి), సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ ఇంద్రమణి త్రిపాఠి పాల్గొన్నారు.

- భువనేశ్వర్/కొరాపుట్

కన్యకా పరమేశ్వరికి 'శ్రావణ సారె'



రాయగడ: అమ్మవారి ఉత్సవ విగ్రహంతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

రాయగడ: కళింగ వైశ్యుల ఆరాధ్యదైవం కన్యకాపరమేశ్వరికి రాయగడలోని కళింగ వైశ్య సంఘం శుక్రవారం శ్రావణమాసం సారె సమర్పించింది. మహిళలంతా పిండి వంటలు, చీరలు, పసుపు, కుంకుమ, గాజులు, ఉత్సవ విగ్రహాన్ని రామలింగశ్వర మందిరం నుంచి కొరాపుట్ కూడలిలోని కన్యకాపరమేశ్వరి ఆలయం వద్దకు ఊరేంగింపుగా తీసుకొచ్చారు. సారెను అమ్మవారికి సమర్పించారు. అందరూ సుభిక్షంగా ఉండాలని, పంటలు పుష్కలంగా పండాలని మొక్కుకున్నారు. ఇకపై ప్రతి ఏటా సారె సమర్పణ ఉంటుందని కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు కింతలి అమర్‌నాథ్ చెప్పారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి టంకాల జయరాం, ఉపాధ్యక్షులు గోపాల్ శెఠి ఈశ్వరరావు, కోశాధికారి వడ్డి మురళి, సంఘం మాజీ అధ్యక్షుడు ఇప్పిలి సన్యాసి రాజు, చిన్నారి విజయ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: అమ్మవారికి సమర్పించిన సారె

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని చైనా మార్కెట్ సమీపంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా జరిగాయి. సుమారు 300 మంది మహిళలు సామూహిక లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. లక్ష్మీ దేవి వేషధారణలో ఉన్న బాలికతో మహిళలకు లక్ష్మీ దేవి విగ్రహాలను బహుమతిగా ఇప్పించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.



కొరాపుట్: లక్ష్మీ వేషధారణలో బాలిక

క్లుప్తంగా

సర్దాపురంలో చైన్‌స్నాచింగ్



విచారణ చేస్తున్న ఐఐసీ రవీంద్ర పాత్రో

పర్లాకిమిడి: గుసాని సమితి గురండి పోలీసు స్టేషన్ పరిధిలోని సర్దాపురంలో మారుతీ బెహరా అనే మహిళ ఆకుకూరలు అమ్మకానికి వెళుతుండగా దుండగులు ద్విచక్ర వాహనంపై వచ్చి లాక్కుని పారిపోయారు. పోగొట్టుకున్న గొలుసు రెండు తులాలు ఉంటుందని మహిళ గురండి పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని గురండి ఐఐసీ రవీంద్రకుమార్ బెహరా తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి



కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయిన జింక

భువనేశ్వర్ : ఢెంకనాల్ జిల్లా కామాఖ్యనగర్ పశ్చిమ పరిధిలోని అలువాఝొరొణొ గ్రామ సమీపంలో శుక్రవారం కుక్కల దాడిలో జింక మృతిచెందింది. ఆహారం కోసం గ్రామం వైపు రావడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన మగ జింకను స్వాధీనం చేసుకొని కళేబర పరీక్షలు నిర్వహించి పూడ్చి వేశారు.

విద్యుదాఘాతంతో ఏనుగు మృతి



మృతి చెందిన ఏనుగు

భువనేశ్వర్: విద్యుదాఘాతంతో ఏనుగు మృతి చెందింది. ఖుర్దా అటవీ రేంజ్ డొమొబొభుంయి అటవీ ప్రాంతంలో మృత ఏనుగుని గుర్తించారు. ఈ విషయం తెలియడంతో సంఘటనా స్థలంలో అటవీశాఖ అధికారులు విచారణ ప్రారంభించారు.

డొంగిరియాలకు కుల ధ్రువీకరణ పత్రాల పంపిణీ



ధ్రువపత్రాన్ని అందిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర రెడ్డి

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి కుర్లి పంచాయతీ ఖజురి, ఖాంబేసు, లుహునిఖుండి గ్రామాలకు చెందిన డొంగిరియా తెగలకు చెందిన 63 మంది ఆదివాసీలకు తహసీల్దార్ కె. వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం కుల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. నియమగిరి కుర్లి పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇకపై అవాంతరాలు లేకుండా ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. మరో 46 మందికి రెసిడెన్స్, 22 మందికి జన్మ ధ్రువీకరణ పత్రాలను అందించామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుభర్దన్ వడక, జిల్లా అదనపు సంక్షేమ శాఖ అధికారి జగబంధు తదితరులు పాల్గొన్నారు.


రైతులకు అండగా నిలవాలి



సమావేశం నిర్వహిస్తున్న సభ్యులు

కొరాపుట్: రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడానికి ల్యాంప్స్ సభ్యులు కృషి చేయాలని కొరాపుట్ సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ కోరారు. శుక్రవారం లమ్తాపుట్ లార్జ్ స్కేల్ ఆదివాసీ మల్టీపర్పస్ కో ఆపరేటివ్ సొసైటీ (ల్యాంప్స్) సర్వసభ్య సమావేశం నిర్వహించారు. లమ్తాపుట్ సమితి గునయిపొడు ల్యాంప్స్ జోన్ సభ్యులు తమ సమస్యలు వివరించారు. మూడు నెలల ఆర్థిక లావాదేవీలను ఎండీ రితేష్ మిశ్రా వివరించారు. కార్యక్రమంలో ల్యాంప్స్ అధ్యక్షురాలు డొముని పాడల్, ఉపాధ్యక్షుడు జగత్ కిరసానీ పాల్గొన్నారు.

పేపర్ మిల్లు సమావేశం వాయిదా



మొదటి, రెండు యూనియన్ల నేతలు

జయపురం: సేవాపేపరు మిల్లు ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు లేబర్ డిప్యూటీ కమిషనర్ ఇచ్చిన నోటీసు ప్రకారం శుక్రవారం జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. మిల్లులో ఉన్న నాలుగు కార్మిక సంఘాల్లో మూడు, నాలుగు యూనియన్లు బల్లార్‌పూర్ మజుదూర్ సంఘం, ఆర్.ఎస్.టి.యు.సిలు గైర్హాజరయ్యాయి. దీంతో సమావేశం వాయిదా పడింది.

పూరీ జగన్నాథ ఆలయం..

బడ్జెట్ రూ.413 కోట్లు



శ్రీమందిరం



సమావేశం నిర్వహిస్తున్న పాలక మండలి సభ్యులు

- నాట్య మండపానికి ఎయిర్ కండిషన్
- శ్రీక్షేత్రానికి స్వతంత్ర ఎఫ్‌ఎం రేడియో
- ఆమోదం తెలిపిన పాలక మండలి

భువనేశ్వర్ : పూరీ జగన్నాథ ఆలయం వార్షిక బడ్జెట్ పాలక మండలి ఆమోదం పొందింది. పూరీ గజపతి మహా రాజా దివ్య సింగ్‌దేవ్ అధ్యక్షతన పూరీ నీలాద్రి భక్తి నివాస్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ. 413 కోట్ల బడ్జెట్‌ను జగన్నాథ ఆలయ మేనేజింగ్ కమిటీ శుక్రవారం ఆమోదించింది. కొత్త ప్రతిపాదన రూ. 500 కోట్ల కార్పస్ ఫండ్‌ను పరిగణనలోకి తీసుకుంటే దాదాపు రూ. 913 కోట్లు అవుతుందని జగన్నాథ ఆలయ పరిపాలనా ప్రధాన పాలన అధికారి (సీఏఓ) డాక్టర్ అరబింద కుమార్ పాఢి తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ఖర్చుల మినహా మిగులు నిధుల పరిమాణం రూ. 103 కోట్లుగా ఉంటుందని వివరించారు. శ్రీ మందిర్ ఆదాయంలో గణనీయమైన మెరుగుదల ఉందని తెలిపారు. మరోవైపు, అడపా పాహండి దుర్ఘటన నివేదిక అసంపూర్ణంగా ఉందన్నారు.

ముఖ్యమైన నిర్ణయాలివే..

- భక్తుల సౌకర్యార్థం శ్రీమందిరంలోని నాట్య మండపం ప్రాంగణంలో ఎయిర్ కండీషనర్లు ఏర్పాటు చేస్తారు. రత్న భాండాగారం నుంచి తొలగించిన బీరువాలు, చెక్క పెట్టెలు తీయించి భక్తులకు అసౌకర్యం తొలగిస్తారు. మహిళలు, పిల్లలు దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేస్తారు. భక్తులకు రత్న వేదికపై మూల విరాటుల సులభ దర్శనం కోసం మార్గం సుగమం చేసేందుకు విస్తృతంగా చర్చించారు.
- ఆచార వ్యవహారాలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి నెలా నీతి సబ్‌కమిటీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.
- జగన్నాథ ఆలయ నిర్వహణకు సంబంధించిన అన్ని రికార్డులు డిజిటలైజ్ చేస్తారు. జగన్నాథుని ఆస్తులకు సంబంధించిన జీపీఎస్ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో స్పేస్ టెక్నాలజీ అప్లికేషన్‌ల కోసం రాష్ట్రంలోని సర్వోన్నత సంస్థ ఒడిషా స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఒర్సాక్) సహాయం తీసుకుంటారు.
- శ్రీమందిరంలో త్వరలో ప్రత్యేక ఎఫ్‌ఎం రేడియో స్టేషన్ ఏర్పాటు కానుంది. దీని ద్వారా శ్రీ జగన్నాథ సంస్కృతిని ప్రసారం చేస్తారు.
- భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) ద్వారా అవసరమైన మరమ్మతులు పూర్తయిన తర్వాత రత్నా భాండాగారం లోపలి, వెలుపలి గదుల తలుపులకు బంగారు పూత పూయాలని పాలక మండలి తీర్మానించింది.
- సేవాయత్‌ల సంక్షేమ పథకాలకు సంబంధించి ఆరోగ్య బీమా, ఆర్థిక సహాయం, పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, క్రీడలను ప్రోత్సహించడానికి సహాయం అందజేసేందుకు ప్రత్యేక ఎస్‌ఓపీ జారీ చేయనున్నారు.

హంతకుల్ని కఠినంగా శిక్షించాలి



గవర్నర్‌తో స్వర్ బృందం

భువనేశ్వర్: భారతీయ స్త్రీ శక్తికి అనుబంధంగా ఉన్న స్వర్ (స్ట్రాంగ్ ఉమెన్ అసోసియేషన్ ఫర్ రిఫార్మేషన్) ప్రతినిధి బృందం శుక్రవారం రాజ్‌భవన్‌ను సందర్శించింది. గవర్నరు రఘుబర దాస్‌తో భేటీ అయింది. కోల్‌కతాలో ఇటీవల జరిగిన అత్యాచారం, హత్య కేసులో హంతకుల్ని కఠినంగా శిక్షించాలని వినతిపత్రం అందజేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ విస్తృత సంతకాల ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

సేవాతత్పరులకు సత్కారం



సమ్రజ్‌హోల్ క్షతగాత్రులను రక్షించిన వారికి సత్కరిస్తున్న గంజాం పోలీసులు

కొరాపుట్ : ఈ నెల 22న గంజాం జిల్లా సమ్రజ్‌హోల్ వద్ద బస్సు, ట్యాంకర్ ప్రమాదం జరిగి నలుగురు మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో స్థానికంగా ఉన్న నలుగురు వ్యక్తులు క్షతగాత్రులను బ్రహ్మపుర ఎంకేసీజీ వైద్య కళాశాలకు తరలించడానికి చాలా కృషి చేశారు. వారిని గంజాం పోలీసులు, రవాణా శాఖ అధికారులు శుక్రవారం ఎస్పీ జగమోహన్ మీనా సమక్షంలో ఘనంగా సత్కరించారు.

హోంశాఖ శ్వేతపత్రం విడుదల

భువనేశ్వర్ : రాష్ట్ర హోంశాఖ శుక్రవారం నేరాలకు సంబంధించిన శ్వేతపత్రం విడుదల చేసింది. దీని ప్రకారం 2023లో రాష్ట్రంలో లక్షా 99 వేల 954 నేరాలు ఘోరాలు జరిగాయి. వాటిలో 1,362 హత్యలు, 370 దోపిడీలు, 2,826 దుర్మార్గాలు, 2,961 దోపిడీలు, 1655 అల్లర్లు ఉన్నట్లు శ్వేతపత్రంలో పేర్కొన్నారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్ట్



అరెస్టయిన దొంగల ముఠా, స్వాధీనం చేసుకున్న వస్తువులతో పోలీసులు

కొరాపుట్ : భారీ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను గంజాం జిల్లా ధారాకొట్ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. సునాముహిన్ గ్రామంలో గోపాల్‌కృష్ణ జెనాకు చెందిన జ్యాయలరీ షాపు జూలై 13న మూసివేసే సమయంలో కొనుగోలుదారులమంటూ కొందరు లోపలికి చొరబడి దోపిడీ చేశారు. వెంటనే బాధిత యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు గంజాం జిల్లా జరడా పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత్రపూర్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ బాధిత్య (కాలు)గా గుర్తించారు. మహారాష్ట్రలోని సోలాపూర్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో అరెస్ట్ చేశారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు ఇదే ముఠాకు చెందిన వారిపై నిఘా వేశారు. ఈశ్వర్ ప్రధాన్ (జాజ్‌పూర్), రాజ్‌కిషోర్ సాహు (జెనాపూర్), సూర్యమణి సాహు(కబతాబంద), ఖాజీ సంసూల్ (కటక్)లను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి 150 గ్రాముల బంగారం, 2 కేజీల వెండి, రూ.60 వేలు నగదు, మరికొన్ని బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు కాలుపై గంజాం జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో 16 దోపిడీ, దొంగతనం కేసులు ఉన్నాయని పోలీసులు ప్రకటించారు.

పాహండి దుర్ఘటన విచారణ నివేదిక అసంపూర్ణం



మాట్లాడుతున్న సీఏఓ అరవింద్ కుమార్ పాఢి

భువనేశ్వర్: ఈ ఏడాది జరిగిన జగన్నాథుని రథ యాత్ర పురస్కరించుకుని మూలవిరాటుల జారుడు ఘటన తీవ్ర కలకలం రేపింది. గుండిచా మందిరం అడపా మండపంపైకి తరలించేందుకు తాళ ధ్వజంపై బలభద్ర స్వామి మూల విరాటు దించుతుండగా పట్టుకోల్పోయింది. దీంతో భారీ దారు విగ్రహం బోర్లా పడింది. ఈ దుర్ఘటనలో పలువురు సేవాయతులు గాయపడ్డారు. దీనిపై విచారణ జరిపేందుకు ప్రత్యేక కమిటీని నియమించారు. ఈ కమిటీ సమర్పించిన నివేదిక అసంపూర్తిగా ఉందని శ్రీ మందిరం పాలక మండలి విచారం వ్యక్తం చేసింది. పాలక మండలి సమావేశం అనంతరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢి ఈ విషయం తెలియజేశారు. ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీ శుక్రవారం 9 అంశాలపై నివేదిక దాఖలు చేసిందని, ఇది అసంపూర్ణంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మరోసారి నివేదికను తర్జుమా చేసి సంపూర్ణ నివేదికగా దాఖలు చేయాలని ఆదేశించినట్లు సీఏఓ ప్రకటించారు.

పార పట్టిన పాత్రికేయులు



కొత్తబస్టాండ్ వద్ద గోతులు పూడ్చుతున్న విలేకరుల బృందం

పర్లాకిమిడి: పర్లాకిమిడి టౌన్ రోడ్డు కొంతకాలంగా అధ్వానంగా తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా రోడ్లు–భవనాల శాఖ ఎస్ఈ. శ్రీకాంత్ సామల్ పనులు చేపట్టకుండా తిరిగి పంపించేస్తున్నారు. దీంతో ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఇక చేసేదిలేక పాత అగ్నిమాపక దళం నుంచి కోర్టు జంక్షన్ వరకూ పాడైన రోడ్డును గజపతి జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు శుక్రవారం మరమ్మతులు చేశారు. పారలు పట్టుకుని సిమెంట్ కంకరతో గోతులు పూడ్చారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ సూపరింటెండింగ్ ఇంజినీర్, జిల్లా యంత్రాంగం రోడ్డు పనులకు టెండర్లు పిలవాలని కోరారు. కార్యక్రమంలో రూపేష్ సాహు, ఆదర్శ దాస్, ప్రనోజ్ కుమార్ పట్నాయక్, బసంత్ పండా, బాసుదేవ్ దాస్, నాగేశ్వర చౌదురి, అనిల్‌కుమార్, ఎస్.రుషి తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు వేళాయె..!



పర్లాకిమిడి పురపాలక సంఘం కార్యాలయం

- నేడు స్థానిక సంస్థల స్వపరిపాలన దినోత్సవం
- అతి పురాతన పురపాలక సంఘంగా పర్లాకిమిడికి ఖ్యాతి

పర్లాకిమిడి: స్థానిక సంస్థల స్వపరిపాలన దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. రాష్ట్రంలోనే అతిపురాతనమైన పర్లాకిమిడి పురపాలక సంఘం 1885లో డిసెంబరు 28న ఏర్పడింది. అయితే ఏటా ఆగస్టు 31న స్వపరిపాలన దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. స్వాతంత్య్రానికి పూర్వం డబ్ల్యూ టేలర్ మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్‌గా నియమితులయ్యారు. అనంతరం సి.వి.ఎల్.పంతులు (1892), ఎం.శ్రీనివాసరావు (జూన్ 1892), ఎస్.ఎస్.రాజగురు (1894), డబ్ల్యూ టేలర్, ఎం.శ్రీనివాసరావు, దామోదర పాఢి (1931), కారుమూరి అప్పారావు (1991) వంటి ఉద్దండులు మున్సిపల్ కౌన్సిల్‌ను పరిపాలించారు. పర్లాకిమిడిలో డబ్ల్యూ టేలర్ సమయంలో డ్రైనేజీ వ్యవస్థ పటిష్టంగా నిర్మించడంతో ఎంతటి వర్షాలు పడినా నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా జంగం వీధి మీదుగా సీతసాగరానికి చేరుకునేది. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు నిర్వహణ గాలికొదిలేయడంతో అస్తవ్యస్తంగా తయారైంది.

నేడు పలు కార్యక్రమాలు..

శనివారం జరగనున్న మున్సిపల్ స్వపరిపాలన దినోత్సవానికి బరంపురం ఎంపీ ప్రదీప్‌కుమార్ పాణిగ్రాహి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. గౌరవ అతిథులుగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, కలెక్టర్ బిజయకుమార్ దాస్, ఎస్పీ స్వాతి ఎస్. కుమార్, డి.ఆర్.డి.ఎ. అధికారి గుణనిధి నాయక్ హాజరుకానున్నారు. ఉదయం 6 గంటలకు పట్టణంలో ప్రతి జంక్షన్‌లో ఉన్న మహారాజా కృష్ణచంద్రగజపతి నారాయణ దేవ్ విగ్రహాలు, హైస్కూల్ జంక్షన్ వద్ద మాజీ ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ విగ్రహాలకు పురపాలక సంఘం చైర్మన్ నిర్మలా శెట్టి పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తారు. పారిశుద్ధ్య కార్మికులకు రివార్డులు, విద్యార్థుకు బహుమతులు అందజేస్తారు. సాయంత్రం బిజూకళ్యాణ మండపంలో సాధారణ సభ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ గౌరచంద్ర పట్నాయక్ తెలిపారు.

షాక్ కొడుతున్న విద్యుత్ స్తంభాలు



స్తంభానికి టెస్టర్ పెట్టి పరీక్షిస్తున్న స్థానికుడు

కొరాపుట్: బ్రహ్మపుర నగరంలో విద్యుత్ స్తంభాలు షాక్ కొడుతున్నాయి. శుక్రవారం రాంలింగం పార్క్ లైన్‌లో రుక్మిణీ థియేటర్ సమీపంలో డివైడర్ వెంబడి ఉన్న పలు స్తంభాలకు విద్యుత్ సరఫరా జరిగింది. స్తంభాలపై పొరపాటున చేయి వేస్తే షాక్ కొట్టాయి. దీంతో స్థానిక యువకులు స్తంభాలకు టెస్టర్లు పెట్టి విద్యుత్ సరఫరా అవుతున్న ఘటనను వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. కాగా, వీటి నిర్వహణ చూస్తున్న బ్రహ్మపుర మున్సిపల్ కార్పొరేషన్, టాటా పవర్ కంపెనీపై విమర్శలు వెల్లువెత్తాయి.

చోరీ కేసులో 10 మంది అరెస్టు



అరెస్టయిన నిందితులతో పోలీసులు

రాయగడ: పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చోరీకి పాల్పడిన పది మంది నిందితులను మునిగుడ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 12 ఎల్ఈడీ టీవీలు, 5 బ్యాటరీలు, 8 ఇన్వర్టర్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. మునిగుడ పోలీస్‌స్టేషన్ ఎస్‌డీపీఓ సంతోషిణి ఓరం, ఐఐసీ సౌదామిని బెహరాలు విలేకర్లకు వివరాలు వెల్లడించారు. పజిబాలి గ్రామానికి చెందిన చంద్రకాంత్ కద్రక, లక్ష్మీకాంత్ హికక, జిబక్ కృషిక, ఉమాకాంత్ హియాల్, ఈశ్వర్ ఎమల్‌పూరి, భరిషిఖమర గ్రామానికి చెందిన దుష్మంత్ బిసొయి, ఛొడరంగి గ్రామానికి చెందిన బిజు కుసులియా, కొటొద్వార గ్రామానికి చెందిన శొక్ హరిజన్, ఛెలియాలనాల్ గ్రామానికి చెందిన ముంటు మహానందియా, కలహండి జిల్లా లంజిఘడ్ గ్రామానికి చెందిన డొంబురు మాఝి(25)లు కొద్ది నెలలుగా మునిగుడ, బిసంకటక్, అంబొదల ప్రాంతాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చోరీలకు పాల్పడ్డారని చెప్పారు. వీటిని తక్కువ ధరకు బయట విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు.

తగ్గిన వరద ఉద్ధృతి



హీరాకుడ్ జలాశయం

భువనేశ్వర్: రాష్ట్రంలో అన్ని నదుల్లో నీటిమట్టం ప్రమాద సంకేతానికి దిగువనే కొనసాగుతోందని జల వనరుల విభాగం ఇంజినీర్ ఇన్ చీఫ్ భక్త మహంతి తెలిపారు. హీరాకుడ్ జలాశయంలోకి సెకనుకు 1.30 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవస్తోంది. 60 వేల క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. బ్రాహ్మణి నదిలో వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ఒక గేటు గుండా వరద నీటిని విడుదల చేస్తున్నారు. హీరాకుడ్ జలాశయం నుంచి మరో 4 గేట్లను తెరిచి లోతట్టు ప్రాంతాలకు వరద నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 6 గేట్ల ద్వారా వరద నీరు ప్రవహిస్తోంది.

ఎన్నికల స్క్రీనింగ్ కమిటీలో కొరాపుట్ ఎంపీ



మహారాష్ట్ర కాంగ్రెస్ పెద్దలతో కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క

కొరాపుట్ : మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీలో కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్క నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ముంబైలోని తిలక్ భవన్‌లో కాంగ్రెస్ పెద్దలతో సమావేశమయ్యారు. త్వరలో జగనున్న మహారాష్ట్ర విధాన సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కోసం ఏఐసీసీ ఏర్పాటు చేసిన కమిటీలో ఈయనకు స్థానం కల్పించారు.

గవర్నర్ అభినందనలు



మంగళ ముదులిని సత్కరిస్తున్న గవర్నర్

భువనేశ్వర్: నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిన ఆదిమ తెగకు చెందిన మంగళ ముదులిని గవర్నర్ రఘుబర్‌దాస్ అభినందించారు. శుక్రవారం రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు.

బినాయక ఆచార్య సేవలు చిరస్మరణీయం



బినాయక ఆచార్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ రామచంద్ర పండా

కొరాపుట్: దివంగత ముఖ్యమంత్రి బినాయక ఆచార్య సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. శుక్రవారం బ్రహ్మపుర నగరంలోని అస్కా రోడ్డులో బినాయక ఆచార్య విద్యాలయంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ రామచంద్ర పండా విద్యాలయ ఆవరణలోని బినాయక విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇదే విద్యాలయంలో బినాయక ఆచార్య ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి రాజకీయాల్లోకి వెళ్లి ముఖ్యమంత్రి అయ్యారని గుర్తు చేశారు. గంజాం వికాస్ మంచ్ అధ్యక్షుడు రాజేంద్రకుమార్, బీజేపీ అధికార ప్రతినిధి గోపి పాల్గొన్నారు.

గుప్తేశ్వర్ మందిర హుండీ ఆదాయం రూ.లక్షా 73 వేలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితిలో ప్రసిద్ధ శైవక్షేత్రం గుప్తేశ్వర్ మందిరంలో హుండీకానుకల ఆదాయం రూ.లక్షా 73 వేల 160 లభించినట్లు శుక్రవారం వెల్లడించారు. జయపురం తహశీల్దార్ కార్యాలయంలో దేవదాయ ధర్మాదాయ విభాగ అధికారి, తహశీల్దార్ డాక్టర్ మనోలిస ఆచార్య సమక్షంలో హుండీ తెరిచి కానుకలు లెక్కించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు భక్తులు వేసిన కానుకలను లెక్కించారు. తిరిగి డిసెంబర్‌లో హుండీ ఆదాయం లెక్కిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి హరిహర శతపతి, దిలీప్‌కుమార్ ప్రధాన్, సూరజ్ కుమార్ పండా, జ్ఞానరంజన్ బిశ్వాల్, తిరెన్ చలాన, దేవదాయ విభాగం సీనియర్ క్లర్క్ కృష్ణ చంద్ర దాస్, జూనియర్ క్లర్క్ శుభం మిశ్రా పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల ఔదార్యం



వృద్ధుడిని రక్షిస్తున్న మున్సిపల్ సిబ్బంది

జయపురం: జయపురం మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది అనాథ వృద్ధుడికి సపర్యలు చేసి అండగా నిలిచారు. మున్నా సాగర్ అనే వ్యక్తి కొంత కాలంగా నారాయణతోట వీధిలో ఉంటున్నాడు. ఎవరైనా తిండి పెడితే తినడం, లేకుంటే అక్కడే ఉండిపోయేవాడు. ఈ క్రమంలో శుక్రవారం వర్షానికి తడుస్తూ చలికి వణికిపోతుండటం చూసిన మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి దుస్తులు సమకూర్చి భోజనం పెట్టారు. అంబులెన్స్‌లో కొరాపుట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించినట్లు మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్దార్థ పట్నాయక్ తెలిపారు. చికిత్స అనంతరం వృద్ధాశ్రమంలో చేర్పుతామని చెప్పారు.

క్లుప్తంగా

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

తెర్లాం: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్సై సాగర్‌బాబు, సిబ్బంది గురువారం సాయంత్రం పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన శుక్రవారం తెలిపారు. చీపురుపల్లికి చెందిన వ్యక్తులు ట్రాక్టర్‌లతో వంతరాం వేగావతి నది నుంచి ఇసుక తరలిస్తున్నారు. ఇసుక తీసుకు వెళ్లేందుకు వారి దగ్గర ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో రెండు ట్రాక్టర్లను పట్టుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశామని చెప్పారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే ఇసుకను ట్రాక్టర్లపై తీసుకువెళ్లాలని, అనుమతి పత్రాలు లేకపోతే ఇసుక తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

ఇద్దరు గంజాయి నిందితుల అరెస్ట్



గంజాయితో పట్టుబడిన వారితో డీఎస్పీ, సీఐ

బొబ్బిలి: ఒడిశా నుంచి బొబ్బిలి, బొబ్బిలి నుంచి బెంగుళూరు నగరానికి గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టుచేశామని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ కొన్నేళ్లుగా పట్టణంలోని వ్యక్తులకు గంజాయి సరఫరా చేస్తున్న 5గురు వ్యక్తులను ఈనెల 16న అరెస్టు చేసి వారి నుంచి15.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారి ద్వారా తెలుసుకున్న సమాచారంతో గంజాయిని పట్టణానికి చేరవేస్తున్న ప్రధాన నిందితులపై నిఘా పెట్టి ఒడిశా రాష్ట్రానికి చెందిన పొట్టంగి రీజియన్ పనసరపాడు చెందిన జెట్టి సీతారాం, లక్ష్మణరావులను బొబ్బిలి పట్టణంలో గంజాయి అంజేసేందుకు రాగా శుక్రవారం అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చి నగదు అపహరణ

గజపతినగరం: స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఏటీఎం కార్డు మార్చి రూ.40వేలు దోచుకున్నారని గజపతినగరంలోని దిగవ వీధికి చెందిన శనపతి ప్రసాద్ వాపోయాడు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను మోసపోయిన తీరును తెలియజేశాడు. రూ.40వేలు జమ చేసేందుకు స్టేట్ బ్యాంక్‌కు వెళ్లి, జమ చేసిన తరువాత పక్కనే ఉన్న ఏటీఎం వద్దకు వెళ్లి పిన్ జనరేషన్ కోసం గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులను అడిగానని చెప్పాడు. ఈ నేపథ్యంలో వారు నగదు బ్యాలెన్స్ చూస్తూ, పిన్ జనరేషన్ చేస్తున్నట్లు నటించి వారి ఏటీఎం కార్డును తనకు ఇచ్చి, తన కార్డును వారు తీసుకు వెళ్లి పోయారని తెలిపాడు. తరువాత నగదు చెక్ చేసుకోగా తన ఖాతాలో ఉండాల్సిన రూ.40వేలు రామభద్రపురంలో విత్ డ్రా చేసినట్లు బ్యాంక్ సిబ్బంది తెలిపారని చెప్పాడు. దీంతో మోసపోయానని తెలుసుకుని గజపతినగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని వివరించాడు.

నలుగురు ఎస్సైలకు బదిలీ

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్‌శాఖలో స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న నలుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఎస్.భాస్కర రావును ఎస్.కోట, ఆర్.నరసింహామూర్తిని రాజాం టౌన్కు, బి.సురేంద్రనాయుడు, వి.లక్ష్మీప్రసన్నకుమార్‌లను విజయనగరం వన్ టౌన్‌కు బదిలీ చేశారు.

ఎంఎస్పీలకు బదిలీ కౌన్సెలింగ్

విజయనగరం క్రైమ్: జిల్లాలో వివిధ గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా సంరక్షణ పోలీసు(ఎంఎస్పీ)లకు ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించి, వారు కోరుకున్న చోటుకు బదిలీ చేస్తూ, ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న ఎంఎస్పీలకు వారి వ్యక్తిగత, కుటుంబ, ఆరోగ్యపరమైన సమస్యలను, భాగస్వామి ఉద్యోగాలను దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రాధాన్యం కల్పిస్తూ బదిలీలు చేపట్టారు. అంతేకాకుండా, ఈ బదిలీల్లో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మ్యూచువల్ బదిలీలకు కూడా ఎస్పీ అవకాశం కల్పించారు. కౌన్సెలింగ్‌కు హాజరైన మహిళా సంరక్షణ పోలీసుల సీనియారిటీ ప్రాతిపదికన ఒక్కొక్కరినీ పిలిచి, వారితో మాట్లాడి, సమస్యలను విని, వాటిని పరిష్కరించే దిశగా వారు కోరుకున్న చోటుకు బదిలీ చేశారు. వివిధ సచివాలయాల్లో ఏర్పడుతున్న ఖాళీల వివరాలను స్క్రీన్‌పై చూపిస్తూ, వారు కోరుకున్న చోటుకు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా బదిలీ చేయడంతో ఎంఎస్పీల నుంచి హర్షం వ్యక్తమైంది. కౌన్సెలింగ్ ప్రక్రియలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) అస్మా ఫర్హీన్, ఎస్పీ సీఐలు కేకేవీ.విజయనాథ్, ఏవీ.లీలారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి

- బిజూ విద్యార్థి జనతా దళ్ అభ్యర్థులకు నవీన్ పిలుపు



బిజూ విద్యార్థి జనతా దళ్ అభ్యర్థులకు నవీన్ అభివాదం

భువనేశ్వర్: రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ తప్పుడు సమాచారంతో ప్రజల్ని తప్పుదోవ పట్టించే వైఖరిని నిలదీయాలని, ఎన్నికల హామీల కార్యాచరణపై ఒత్తిడి తీసుకురావాలని బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక శంఖ భవనంలో శుక్రవారం బీజేడీ విద్యార్థి వర్గం కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రాంతీయ పార్టీగా బిజూ జనతా దళ్ ప్రజా సేవలో 27 ఏళ్లగా నిమగ్నమై ఉందన్నారు. అధికార కాంక్ష బీజేడీ యోచన కాదని, ప్రజా సేవ బీజేడీ ఏకైక లక్ష్యంగా పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటమి సహజం, ఇటీవల ముగిసిన ఎన్నికల్లో బీజేడీకి 41.02 శాతం ఓట్లు సాధించిందని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని, మల్కన్‌గిరిలోని మారుమూల గ్రామానికి చెందిన బొండా తెగకు చెందిన మంగళ ముదులి అనే యువకుడు నీట్‌లో ఉత్తీర్ణత సాధించి డాక్టర్‌గా మారడం సంతోషంగా ఉందన్నారు. ఒడిశా ఇప్పుడు భారతదేశానికి క్రీడా రాజధానిగా అవతరించిందన్నారు. ఒడిశా భవిష్యత్తుకు యువత సారథులు కావాలని ఆకాంక్షించారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ తప్పుడు సమాచారం, అబద్ధాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మాజిక భద్రత లబ్ధిదారులందరికీ 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 3000 పింఛను, మహిళలందరికీ రూ.50,000 చొప్పున ఇస్తామని తదితర హామీలు ఇచ్చిన బీజేపీ ప్రభుత్వాన్ని అమలు చేయాలని ఒత్తిడి తేవాలన్నారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..



రైలు ప్రమాదంలో మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

విజయనగరం క్రైమ్: జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌లో శుక్రవారం రైలు ఢీకొని సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. దీనిపై రైల్వే పోలీసులు మాట్లాడుతూ మృతుడి శరీరంపై లైట్ పింక్ కలర్ టీ షర్ట్, గ్రీన్‌కలర్ గడుల లుంగీ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9490617089 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై వి.బాలాజీరావు తెలిపారు.

మార్బుల్స్ పడి యువకుడు..



శశికుమార్ మృతదేహం

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి కొండంపేట గ్రామానికి చెందిన నందమూడి శశికుమార్ (24) మార్బుల్స్ పలకపడి మృతిచెందాడు. శుక్రవారం రాజాంలో జరిగిన ఈ సంఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గృహ నిర్మాణానికి అవసరమైన మార్బుల్స్‌ను స్థానిక చీపురుపల్లి రోడ్డు నుంచి లగేజీ వ్యాన్‌లో తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో బొబ్బిలి జంక్షన్ సమీపంలోకి వ్యాన్ రాగానే రోడ్డుపై ఏర్పడిన గొయ్యి కారణంగా వ్యాన్ అదుపుతప్పి అందులోని మార్బుల్స్‌కు కట్టిన తాడు తెగిపోవడంతో ఒక్కసారిగా అందులో ఉన్న శశికుమార్‌తోపాటు మరో ముగ్గురిపై అవి పడ్డాయి. ఈ ప్రమాదంలో మార్బుల్స్ కింద చిక్కుకున్న శశికుమార్ తలకు తీవ్రగాయాలు కాగా మిగిలిన వారికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి పలకలను తొలగించి తీవ్రగాయాల పాలైన శశికుమార్‌ను రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయం తెలిసి ఆస్పత్రి వద్దకు చేరుకున్న గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య చందనతో పాటు కుమార్తె ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి మృతుని తండ్రి శంకరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి..



పాముకాటుతో మృతి చెందిన కొమ్ము కృష్ణ

గుర్ల: మండలంలోని నడుపూరు గ్రామానికి చెందిన కొమ్ము కృష్ణ (54) పాముకాటుతో శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మూడు రోజుల కిత్రం తెల్లవారు జామున వరి చేనులో నీరు తోడడానికి కృష్ణ వెళ్లాడు. పొలం గట్టుపై పాము కరవడంతో కుటుంబసభ్యులకు సమాచారం తెలియజేసి వారి సహాయంతో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స కోసం చేరాడు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నానికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయిందని కుటుంబసభ్యులు వాపోయారు. మృతునికి భార్య వెంకటలక్ష్మి, కుమారుడు సంతోష్ ఉన్నారు. ఫిర్యాదు మేరకు ఎస్సై పి.నారాయణ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూలకోసం వెళ్లి మరో వ్యక్తి..



చెరువులో పడి ప్రాణాలు కోల్పోయిన రమణ

శృంగవరపుకోట: పట్టణంలోని మునసబువీధికి చెందిన సోమాదుల రమణ(48) కలువ పూలు కోసుకుని వస్తానని, శ్రావణశుక్రవారం పూజలకు అమ్ముకోవచ్చని ఇంటి వద్ద చెప్పి గురువారం ఉదయం వెళ్లాడు. రాత్రయినా ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబసభ్యులు ఇరుగుపొరుగు వారికి చెప్పడంతో అంతా కలిసి వెదుకులాట ప్రారంభించారు. పట్టణానికి సమీపంలో ఉన్న జగన్నాథ సాగరం చెరువు వైపు వెళ్లిన వారు ఒడ్డున రమణ బట్టలు ఉండటంతో చెరువులో గాలించారు. చెరువులో రమణ శవమై తేలాడు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పూలు అమ్ముకుందామని వెళ్లి ప్రాణం దక్కకుండా పోయాడంటూ భోరుమన్నారు. పూలు కోసమని చెరువులోకి దిగిన తన తమ్ముడు రమణకు ఈత రాకపోవటం వల్ల మునిగిపోయి చనిపోయి ఉంటాడని సోదరుడు సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.కోట ఏఎస్సై టి.వి.రమణ కేసు నమోదు చేశారు.

గాయపడిన గోమాతలకు చికిత్స



రోడ్డు పక్కన ఆవులకు వైద్యసేవలు అందిస్తున్న పశు వైద్యులు

కొరాపుట్: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాదానికి గురైన ఆవులకు పశువైద్య సిబ్బంది చికిత్స అందించారు. శుక్రవారం కొరాపుట్ జిల్లా దశమంతపూర్ సమితి మార్గంలో రెండు ఆవులను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లి పోయింది. తీవ్ర గాయాలైన ఆవులను చూసి చలించిన బాటసారులు దశమంత్‌పూర్ ప్రభుత్వ పశువైద్యశాలకు సమాచారం అందించారు. వెంటనే పశు వైద్య సిబ్బంది ప్రత్యేక వాహనంలో ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స అందించారు. పశు వైద్యులు డాక్టర్ శుబేందు శేఖర్ పాఢీ, పశు సహాయక విభాగ ఇన్‌స్పెక్టర్ చిత్తరంజన్ సూచన్‌ల సేవలను స్థానికులు అభినందించారు.

‘వివాహిత ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు’



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నరసన్నపేట: స్థానిక శ్రీనివాస అపార్ట్‌మెంటు నాలుగో ఫ్లోర్‌లో ఆత్మహత్యకు పాల్పడిన బరాటం అనూరాధ భర్త శ్రావణ్‌ను అరెస్టు చేసినట్లు పలాస డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వరకట్న వేధింపులతో అనూరాధ ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. భార్యాభర్తల మధ్య రోజూ ఘర్షణలు జరిగేవని, అనూరాధ మృతి చెందిన రోజు కూడా ఇద్దరూ గొడవ పడ్డారని అన్నారు. శ్రీకాకుళంలో ఒక ఫంక్షన్‌కు వెళ్లేందుకు ఇద్దరూ బయల్దేరి మధ్యలో గొడవపడ్డారు. దీంతో మడపాం టోల్‌గేట్ నుంచి శ్రీకాకుళం వెళ్లకుండా వెనక్కి వచ్చేశారని డీఎస్పీ తెలిపారు. ఇంటికి వచ్చిన వెంటనే శ్రావణ్ తన గాజుల షాపునకు వెళ్లగా అనూరాధ బెడ్‌రూంలోనికి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. గాజుల షాపులో ఉన్న శ్రావణ్ తన భార్యకు ఫోన్ చేయగా ఆమె లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటికి వచ్చి చూసే సరికి బెడ్‌రూం తలుపులు లోపల గెడ వేసి ఉందని, గెడ విరగ్గొట్టి తలుపులు తీసి లోపలికి వెళ్లే సరికి అనూరాధ మృతి చెంది ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. ఈ వివరాలన్నీ శ్రావణ్ నుంచి తెలుసుకున్నామని చెప్పారు. అయితే మృతురాలి తల్లిదండ్రులు శ్రావణ్ తల్లిదండ్రులపైనా ఫిర్యాదు చేశారని, కానీ వారి ప్రమేయం కనిపించడం లేదని తెలిపారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. విలేకరుల సమావేశంలో సీఐ జె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెండున్నర తులాల బంగారం చోరీ

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారికి ఆనుకుని కుశాలపురం పంచాయతీ నవభారత్ సమీపంలోని సీపాన వెంకటరమణ ఇంటిలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఇంటి తాళాలు విరగ్గొట్టి లోపలకు ప్రవేశించిన దొంగలు బీరువా తాళాలు పగలగొట్టి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. వెండి వస్తువులు, ఇతర గృహ సామగ్రిని మాత్రం వదిలేశారు. వెంకటరమణ తమ్ముడి కుమార్తెకు ఆరోగ్యం బాగులేకపోవడంతో గురువారం రాత్రి 9.30 గంటల సమయంలో ఆస్పత్రికి వెళ్లారు. ఆయన భార్య మాధురి కూడా నాలుగు రోజుల కిందట విశాఖలోని బంధువుల ఇంటికి వెళ్లారు. దీంతో తాళం వేసి ఉన్న ఇంటిలోకి దొంగలు ప్రవేశించి బంగారం దొంగతనం చేశారు. శుక్రవారం ఉదయం ఇంటి యజమానికి వచ్చి చూసే సరికి దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జి ఎస్ఐ ఎస్.చిరంజీవి, ఏఎస్ఐ శ్రీనివాసరావు చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించాయి. జాతీయ రహదారికి ఆనుకుని ఇటీవల దొంగతనాలు పెరుగుతున్నాయి. కుంచాలకూర్మయ్యపేటలోని దేవీ పీఠం లో అమ్మవారి నగలు, హుండీ చోరీ, తమ్మినాయుడుపేటలో లలితా త్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో చోరీ, కొయ్యరాళ్ల సమీపంలో ఓ ఇంటిలో చోరీ వంటివి చోటు చేసుకున్నాయి. ఆలయాల్లో సీసీ కెమెరాలు ఉన్నా చోరీలు జరుగుతుండటం గమనార్హం.

న్యాయవాదులకు శిక్షణ



శిక్షణ శిబిరంలో పాల్గొన్న సుమన్ జెనా, తదితరులు

జయపురం: కొరాపుట్ జిల్లాలలోని ప్యానెల్ న్యాయవాదులకు శుక్రవారం జయపురం న్యాయ సేవా ప్రదీకరణ ఆధ్వర్యం శిక్షణ శిబిరం నిర్వహించారు. జయపురం, కొరాపుట్, కొట్‌పాడ్, బొరిగుమ్మ, లక్ష్మీపూర్, సెమిలిగుడ, లమతాపుట్, దశమంతపూర్ ప్రాంతాలకు చెందిన న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెనా పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అనిమేష్ జెనా, సీనియర్ న్యాయవాది శశానంద మిశ్రా, దాశరధి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మానవాళి బాధ్యత

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: పర్యావరణ పరిరక్షణ మానవాళి బాధ్యతగా గుర్తించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటిన ఆయన ప్రపంచం ఆధునీకరణ పేరుతో ఏర్పడుతున్న వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్ఎన్వీ శ్రీధర్ రాజా, చీపురుపల్లి జెడ్పీటీసీ ప్రతినిధి వలిరెడ్డి శ్రీనివాసరావు, మాజీ టూరిజం బోర్డ్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు, సర్పంచ్ యశోద, ఎం.అప్పలరమణ, దేముడు, జిల్లా పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మొక్కలే కీలకం

- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్



వనమహోత్సవం ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం: పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ పేర్కొన్నారు. ఈ మేరకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని కోట జంక్షన్ నుంచి చేపట్టిన వనమహోత్సవ ర్యాలీని ఆయన జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమల రావు, ఇతర అధికారులు, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్న ఈ ర్యాలీ కోట నుంచి మూడు లాంతర్లు, గంటస్తంభం, న్యూపూర్ణ జంక్షన్ మీదుగా రాజీవ్ స్టేడియం వరకు సాగింది. ర్యాలీని ప్రారంభించిన అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్న ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి నెల రోజులపాటు అన్ని ప్రాంతాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

అలవెన్స్ రద్దు తగదు



డిపో ఎదుట నిరసనలో ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్యకర్తలు

విజయనగరం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులకు ఈ నెల నుంచి నిలిపివేసిన అలవెన్స్‌ను పునరుద్ధరించాలని, ఇతరత్రా బకాయి బిల్లులను సకాలంలో చెల్లించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ డిమాండ్ చేసింది. విజయనగరం ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం ఆందోళన చేసింది. అలవెన్స్ విధానాన్ని పునరుద్ధరించి, ఎరియర్స్ బిల్లులు, సిక్ లీవుల బిల్లులు, రిటైర్ ఉద్యోగుల సెటిల్మెంట్స్, ఏఏఎస్‌ల ఎరియర్స్ తదితర బకాయి బిల్లులు సకాలంలో చెల్లించాలని యూనియన్ సభ్యులు కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పీజీ రాఫిల్, డిపో అధ్యక్షుడు బి.రామారావు, డిపో కార్యదర్శి కె.చంద్రమౌళి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదరరావు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలోఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పాత బస్ స్టాండ్ దగ్గర గల ఆర్‌సీఎం సెయింట్ పీటర్స్ స్కూల్ నుంచి కలెక్టరేట్ వరకూ హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై సాగిన అవగాహనా చైతన్య ర్యాలీని జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఐవీ కేవలం లైంగిక కార్యకలాపాల ద్వారా మాత్రమే ఇతరులకు సంక్రమిస్తుందని, కలిసి భోజనం చేయడం వల్లగానీ, కలిసి తిరగడం వల్ల గానీ, కరచాలనం వల్ల గానీ సంక్రమించదని వివరించారు. వ్యాధి ఎలా వ్యాపి చెందుతుంది? రాకుండా ఏ జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించడానికే ఈ ర్యాలీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదర రావు అన్నారు. 5కె రెడ్ రన్ మారథాన్ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి ఎం. వినోద్‌కుమార్, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయ అధికారి డా.పీఎల్ రఘు కుమార్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు నగదు బహుమతి అందజేత

5కె రెడ్ రన్ మారథాన్‌లో పురుషుల విభాగంలో మొదటి బహుమతి ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థి జి.గౌరీశంకర్, రెండవ బహుమతిని ఎస్.నరేంద్ర (ఎంఆర్ఎస్ఏవీఎన్ కళాశాల), బాలిక విభాగంలో మొదటి బహుమతి ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థిని బి.రేణుక, రెండవ బహుమతి జి.జె.కళాశాల విద్యార్థిని అధికారి లలిత, ట్రాన్స్‌జెండర్స్ విభాగంలో మొదటి బహుమతి ఎస్వీటీ జూనియర్ కాలేజ్ విద్యార్థి మేకల నరేష్, రెండవ బహుమతి రాజీవ్ గాంధీ వృత్తి విద్యా జూనియర్ కళాశాల విద్యార్థి గొడు.రమేష్ గెలుపొందారు. మొదటి బహుమతిగా రూ.7వేలు, రెండవ బహుమతిగా రూ.4 వేలను రెండవ అదనపు జిల్లా జడ్జి విద్యార్థులకు అందజేశారు.

మడ్డువలసలో చిక్కుకున్న మత్స్యకారులు

- పదిగంటల పాటు గంగమ్మ ఒడిలో నిరీక్షణ
- ఫోన్ సమాచారంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత
- క్షేమంగా ఒడ్డుకు చేరుకున్న నలుగురు మత్స్యకారులు
- ఊపిరి పీల్చుకున్న మత్స్యకార కుటుంబాలు, అధికారులు



పడవల సహాయంతో ఒడ్డుకు చేరుతున్న మత్స్యకారులు

వంగర: మండల పరిధిలోని మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో నలుగురు మత్స్యకారులు శుక్రవారంచిక్కుకుని దాదాపు పది గంటల తరువాత బయటపడ్డారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మగ్గూరు గ్రామానికి చెందిన సూరిమల్లి రాజు, సూరిమల్లి శ్రీను, సూరిమల్లి చిన్న, గుంట్రెడ్డి పోలి ఎప్పటి లాగానే శుక్రవారం మడ్డువలస సాయిబాబా గుడి వెనుక భాగంలో సంజీవని కొండను ఆనుకుని ప్రాజెక్టులో చేపల వేట చేసేందుకు వేకువజామున 4.30 గంటల సమయంలో ప్రాజెక్టులోకి దిగారు. చీకటిగా ఉండడంతో కొంతదూరం వెళ్లేసరికి దారి కనిపించకపోగా వారి పడవల చుట్టూ గుర్రపుడెక్క చేరింది. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 2,500 క్యూసెక్కుల వరద నీరు రావడంతో ఆ నీటితోపాటు గుర్రపుడెక్క వచ్చి పడవల చుట్టూ చేరగా పడవలు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఏం చేయాలో తెలియక ఉదయం 7గంటల సమయంలో కుటుంబసభ్యులకు తమ వద్ద ఉన్న ఫోన్ల ద్వారా మత్స్యకారులు సమాచారం అందించారు. ఈ క్రమంలో గ్రామంలో ఉన్న మత్స్యకార కుటుంబాలు ఆందోళనతో ప్రాజెక్టు వద్దకు పరుగులు తీశాయి. ప్రాజెక్టు అధికారులు, వంగర పోలీసులకు ఉదయం 8 గంటల సమయంలో సమాచారం అందించారు. వారంతా 9 గంటల సమయంలో ప్రాజెక్టు వద్దకు చేరుకుని ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేశారు. ఎప్పటికప్పుడు ప్రాజెక్టులో ఉన్న మత్స్యకారుల క్షేమ సమాచారాన్ని ఎస్సై షేక్ శంకర్, ప్రాజెక్టు డీఈ పి.అర్జున్, ఏఈ నితిన్‌లు తెలుసుకున్నారు.

ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేసి..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్టు వద్ద రెండు గేట్లు ఎత్తివేసి పెద్ద ఎత్తున గుర్రపుడెక్కను గేట్ల ద్వారా తొలగించారు. దీంతో మత్స్యకారుల చుట్టూ పేరుకుపోయిన గుర్రపుడెక్క నెమ్మదిగా గేట్లవైపు నీటితో పాటు రావడంతో నలుగురు మత్స్యకారులు ఒడ్డుకు చేరుకున్నారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కుటుంబ సభ్యులు వారిని చూసి కన్నీటిపర్యంతరమయ్యారు. ఈ సందర్భంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులు మాట్లాడుతూ చేపల వేట చేసే సమయంలో తమ చుట్టూ గుర్రపుడెక్క పేరుకుపోవడంతో పడవలు ముందుకు కదలలేదని, ఏమై పోతామోనని భయపడ్డామని చెప్పారు. తమ వద్ద సెల్‌ఫోన్ ఉండడంతో క్షేమ సమాచారాన్ని ఎప్పటికప్పుడు కుటుంబసభ్యులు, అధికారులకు చేరవేయగలిగామన్నారు. గంగమ్మ ఒడిలో పది గంటల పాటు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాలం గడిపామని చెప్పారు. సంఘటనా స్థలంలో తహసీల్దార్ ధర్మరాజు, డీటీ బూరాడ సుందరరావు, ఆర్ఐ జామి మురళి, వీఆర్వో రాజు, ప్రాజెక్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు.